సాక్షి
అనంతపురం
శుక్రవారం । 31 । జనవరి । 2025



టన్ను చీనీ రూ.16 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు పలికాయి .



కిలో టమాట రూ.13
అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
34.7°/11.1°

జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆంధ్రా అండర్-14 జట్టుకు ఎంపిక





ఎం. రోహిత్, వై. లిఖిత్, ఆదినారాయణ రెడ్డి

అనంతపురం: ఆంధ్రా అండర్ -14 జట్టుకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపిక య్యారు. అనంతపురం నగరానికి చెందిన వై. లిఖిత్ కుమార్, ఎం. రోహిత్‌తో పాటు ఆత్మకూరు మండలానికి ఆదినారాయణ రెడ్డి జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

- ఎం. రోహిత్ కుడి చేతి మీడియం పేసర్, మిడిల్ ఆర్డర్ బ్యాటర్. జోనల్ టోర్నీలో 14 వికెట్లు తీసి సత్తా చాటాడు.
- వై. లిఖిత్ ఎడమ చేతి స్పిన్నర్, కుడి చేతి మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్. జోనల్ మ్యాచ్‌ల్లో నాలుగు వికెట్లు, అంతర్ జిల్లా మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసి ప్రతిభ కనబరిచాడు.
- ఎడమ చేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అయిన ఏ.ఆదినారాయణ రెడ్డి అంతర్ జిల్లా మ్యాచ్‌ల్లో ఒకే ఇన్నింగ్స్‌లో 181 పరుగులు చేసి శభాష్ అనిపించుకున్నాడు. అండర్-14 జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి వి. భీమలింగా రెడ్డి అభినందనలు తెలిపారు. ఫిబ్రవరి 6 నుంచి 13 వరకూ విజయనగరంలో జరగనున్న ఏసీఏ అంతర జోన్ టోర్నీలో క్రీడాకారులు పాల్గొననున్నారు.

ఎమ్మెస్సీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఎమ్మెస్సీ ఫలితాలు విడుదలయ్యాయి. గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించిన ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ (మూక్స్, కన్వెన్షనల్ మోడ్) ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ నాగప్రసాద్‌నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ(ఏ) పరీక్షల పోర్టల్ చూడాలని కోరారు.

రెచ్చ గొట్టి.. రచ్చ చేసి

- రసాభాసగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- 'సూపర్ సిక్స్'పై అడిగితే రెచ్చిపోయిన టీడీపీ ప్రజాప్రతినిధులు
- జెడ్పీటీసీలకు అడుగడుగునా అడ్డు
- ఆద్యంతం గందరగోళం
- ప్రజా సమస్యలపై చర్చించకుండానే ముగింపు



సభ్యులకు నచ్చజెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, చిత్రంలో మంత్రి సవిత, జేసీ శివ్ నారాయణ్ శర్మ



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, ఎంపీపీలు

అనంతపురం సిటీ: టీడీపీ ప్రజాప్రతినిధుల పుణ్యమా అని అనంతపురం జెడ్పీ సమావేశం రసాభాసగా మారింది. హామీలపై ప్రశ్నించిందే తప్పన్నట్లుగా ఎమ్మెల్యేలు రెచ్చిపోయారు. అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. దీంతో ప్రజల సమస్యలు చర్చకు రాకుండానే సమావేశం ముగించాల్సి వచ్చింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జెడ్పీ సమావేశ ప్రధాన భవన్‌లో నిర్వహించారు. మంత్రి సవిత, విప్ కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంతపురం అర్బన్, మడకశిర ఎమ్మెల్యేలు దగ్గుబాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ హాజరయ్యారు. సీఈఓ రాజోలి వీరారెడ్డి చర్చను ప్రారంభించగా.. సభను జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనసాగించారు.

ఆద్యంతం అడ్డు..
సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసేలా సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని యల్లనూరు జెడ్పీటీసీ సభ్యుడు బోగాతి విజయప్రతాప్‌రెడ్డి కోరగా.. నేరుగా సమాధానమివ్వని మంత్రి సవిత, విప్ కాలవ, ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు దగ్గుబాటి ప్రసాద్,రాజులు గత ప్రభుత్వంలో ఏం చేశారంటూ రెచ్చిపోయారు. అంతలోనే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు... తమ ప్రభుత్వం వాట్సాప్ ద్వారా 161 సేవలను అందుబాటులోకి తెస్తోందని, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేయాలని కోరడంపై జెడ్పీ సభ్యులు మండిపడ్డారు. గత ప్రభుత్వం గురించి అనవసరమని, మీరేం చేస్తారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. తాను టీడీపీ నుంచి గెలవడంతో నిధుల కేటాయింపులో పక్షపాతం చూపారని అగళి జెడ్పీటీసీ ఉమేష్ ఆరోపించగా.. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే రాజు సైగ చేయగా, జెడ్పీటీసీ ఉమేశ్ గట్టిగా అరుస్తూ పోడియం వద్దకు దూసుకెళ్లారు. దీంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు సైతం మూకుమ్మడిగా పోడియం వైపు రావడంతో రెండు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ తమకు 63 మండలాలూ సమానమేనని, అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయిస్తూ వచ్చామన్నారు. అగళి జెడ్పీటీసీ ఏ రోజూ తమకు పనులు కావాలని అడిగింది లేదని, 10 రోజుల క్రితం రూ.90 లక్షలకు ప్రతిపాదనలు తీసుకువచ్చి వెంటనే మంజూరు చేయాలంటూ పట్టుబట్టారన్నారు. రూ.30 లక్షలు ఇస్తున్నట్లు చెప్పినా పేపర్లు విసిరి వెళ్లిపోయాడన్నారు. సీఈఓ రామచంద్రారెడ్డి కల్పించుకుంటూ నిధులు ఇచ్చినా లేదంటూ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. దీనిపై టీడీపీ ప్రజాప్రతినిధులు ప్రతిస్పందిస్తూ సభలో అల్లరి చేశారు.

తమ్ముళ్లకు పర్సంటేజీలు ఇవ్వాలట..
జెడ్పీ నిధులతో చేపట్టే పనుల్లో పర్సంటేజీలు ఇవ్వడం లేదంటూ తెలుగు 'తమ్ముళ్లు' పనులు అడ్డుకుంటున్నారని కదిరి జెడ్పీటీసీ సభ్యురాలు భుక్యా రాధాబాయి ఆరోపించారు. దీనిపై మంత్రి సవిత, విప్ కాలవ, ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు దగ్గుబాటి, ఎంఎస్ రాజు అభ్యంతరం తెలపడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు దీటుగా సమాధానమిచ్చారు. బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ.. ఇటీవల తమ ప్రాంతానికి చెందిన ఓ బాలుడు తీవ్ర అస్వస్థతకు గురి కాగా, అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారని, అయితే డబ్బు కడితేనే వైద్యం చేస్తామని చెప్పడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి సరైన సమాధానం చెప్పకపోవడంతో ఎంపీ బీకే ఆగ్రహం వ్యక్తం చేశారు. మడకశిర ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ.. అనంతపురం కిమ్స్ సవేరా ఆస్పత్రిలో సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించి బిల్లులు ఇవ్వడం లేదని, రోగులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. తమ నియోజకవర్గంలో 108లు మూలనపడ్డాయని, ఒకే ఒక 108 పని చేస్తోందని తెలిపారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో దంత సమస్యలకు వైద్యం చేయడం లేదని, చిన్న కేసునూ బయటి ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని నార్పల జెడ్పీటీసీ సభ్యురాలు వేదాంతం నాగరత్నమ్మ తెలిపారు. 108 అంబులెన్స్‌లో సౌకర్యాలు లేకపోవడంతో రోగులను ఆస్పత్రికి తరలించేలోపే మృత్యువాత పడుతున్నారని అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ పేర్కొన్నారు. హిందూపురంలో జిల్లా స్థాయి ఆస్పత్రి ఉన్నా.. చిన్న కేసునూ అనంతపురానికి రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నట్లు లేపాక్షి జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. దీనిపై శ్రీసత్యసాయి జిల్లా డీసీహెచ్ఎస్ నాయక్.. డాక్టర్ల కొరతతో ఇలా చేయాల్సి వస్తోందని తెలపడంపై ఎంపీ బీకే అభ్యంతరం వ్యక్తం చేశారు. డాక్టర్ల కొరత నెపం చూపి తప్పించుకోవాలని చూడొద్దన్నారు. తమ మండలంలోనూ వైద్య సేవలు సరిగా అందడం లేదని బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న, వజ్రకరూరు ఎంపీపీ రమావత్ దేవి ఆరోపించారు.

నువ్వాగమ్మా.. నీకేం తెలీదు

జెడ్పీ సమావేశంలో ఎంపీ బీకే పార్థసారథి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను ఏకవచనంతో సంబోధించడం, నువ్వాగమ్మా.. నీకేం తెలీదు అంటూ తక్కువ చేసి మాట్లాడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. అధ్యక్ష స్థానంలో ఉన్న చైర్‌పర్సన్‌ను ఏకవచనంతో మాట్లాడటం ఇదేం సంస్కారమంటూ ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కూడా చర్చించుకోవడం కనిపించింది.

కంది కొనుగోలులో ఆంక్షలా..?

కంది కొనుగోలు విషయంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలు చూసి రైతులకు ఏం చేయాలో అర్థం కావడం లేదని జెడ్పీటీసీ సభ్యులు పేర్కొన్నారు. కేవలం మూడు క్వింటాళ్లు కొనాలని షరతు విధించడం సరికాదన్నారు. విప్ కాలవ స్పందిస్తూ.. బయటి మార్కెట్‌కు, ప్రభుత్వ ధరకు మధ్య క్వింటాలుకు రూ.1,000 వ్యత్యాసం ఉందని, 5 క్వింటాళ్ల వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి మాట్లాడుతూ మామిడి రైతులను ఆదుకోవాలని కోరారు. తమ మండలంలో అన్ని శాఖలకు ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు కావడంతో పనులు జరగడం లేదని చిలమత్తూరు జెడ్పీటీసీ అనూష అధికారుల దృష్టికి తెచ్చారు. వివిధ పనుల నిమిత్తం అనంతపురానికి వస్తే.. కనీసం అతిథి గృహ సదుపాయం కూడా లేదని, శిథిలావస్థకు చేరిన జెడ్పీ అతిథి గృహాలకు మరమ్మతులు చేయాలని కంబదూరు జెడ్పీటీసీ నాగరాజు కోరారు. తమ ప్రాంతానికి వచ్చే పల్లె వెలుగు బస్సుకు కండక్టర్ లేకుండా వన్‌మ్యాన్ సర్వీసును నడపడం వల్ల ఒక విద్యార్థి మృత్యువాతపడ్డాడని విడపనకల్లు జెడ్పీటీసీ హనుమంతు ఆవేదన వ్యక్తం చేశారు.



జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతుంటే అడ్డుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అంగన్‌వాడీ.. ఒకే చిన్నారి



కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి కాపలాగా కార్యకర్త

పెద్దవడుగూరు మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు లేక వెలవెలబోతోంది. కేంద్రంలో ఒక బాలింత, ఒక గర్భిణి, నలుగురు చిన్నారుల పేర్లు నమోదు కాగా గురువారం ఒక చిన్నారి మాత్రమే నిద్రపోతూ కనిపించింది. ఇద్దరు పిల్లలు వేరే ఊరికి వెళ్లారని, ఒక పాప ఇంటికి వెళ్లిందని, బాలింత, గర్భిణులు కూడా వేరే ప్రాంతానికి వెళ్లారని అంగన్‌వాడీ కార్యకర్త సమాధానం ఇచ్చారు. కేంద్రానికి పౌష్టికాహారం సమయానికి చేరుతున్నప్పటికీ చిన్నారులు సక్రమంగా రాక వృథా అవుతోందని పలువురు గ్రామస్తులు తెలిపారు. పిల్లలను అంగన్‌వాడీకి తీసుకెళ్లి పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేసేలా చూడాలని కోరుతున్నారు. – పెద్దవడుగూరు

నారాయణ విద్యా సంస్థను సీజ్ చేయాలి



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

- విద్యార్థి సంఘాల డిమాండ్
- నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన నారాయణ విద్యా సంస్థను సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ఇంటర్‌బోర్డు అధికారులు కానీ, పోలీసు అధికారులు కానీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నారాయణ కళాశాల ఎదుట ఆందోళన చేస్తే అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. జిల్లా పోలీసులపై తమకు అపార నమ్మకం ఉందన్నారు. అయితే, విద్యార్థి బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటే పోలీసులు రాకనే రక్తపు మరకలు తొలగించారని, ఫీజు కోసం ఒత్తిడి చేశారని స్వయంగా తండ్రి చెప్పినా, విద్యార్థి సంఘాల నాయకులు డీఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకపోవడంపై అనుమానాలు కల్గుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కళాశాల యాజమాన్యంపై కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాసుల కోసం కక్కుర్తిపడుతున్న ఇంటర్ బోర్డు ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి లోకేష్ ట్విట్టర్ల శాఖకు మంత్రి కాదని, ఆయన విద్యాశాఖ మంత్రి అనే విషయం మరిచిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఏదైనా సంఘటన జరిగితే సోషల్ మీడియాలో కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నారాయణ విద్యాసంస్థల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు విద్యార్థి నాయకులు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధానకార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలుకు 'రాంరాం'



సరళ విజయకుమారి

అనంతపురం అర్బన్: జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరళ విజయకుమారి శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. సాధారణంగా ఉద్యోగి రిటైర్డ్ అవుతుంటే... ఆ సందర్భాన్ని పురస్కరించుకుని సహచరులు ఘనంగా వీడ్కోలు పలుకుతారు. అయితే ఖజానాశాఖ డీడీ విషయంలో ఇందుకు భిన్నంగా పరిస్థితి నెలకొనడం చర్చనీయాంశమైంది. ఆ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు పెనుబోలు శంకర్ పేరిట ఒక మెసేజ్ ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులో వైరల్ అవుతోంది. ''బ్రిటీష్ పరిపాలనకాలంలో మాదిరి నలిగిపోయిన ట్రెజరీ ఉద్యోగులు 31వ తేదీతో విముక్తులవుతున్నారు. ఉద్యోగులను బానిసల్లాగా చూసిన ఈ డీడీ నిరంకుశత్వాన్ని నిరసిస్తూ.. ఆమె పదవీ విరమణ కార్యక్రమాన్ని మనమంతా బహిష్కరిస్తున్నాం. జిల్లా ఆఫీసు నందు అధికారులు కానీ, ఉద్యోగులు కానీ దయచేసి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నించకూడదని ప్రార్థిస్తున్నా. కాదని చేసేందుకు ముందుకు వచ్చిన వారు జరగబోవు ఇబ్బందులకు బాధ్యులు, బాధితులు కాకూడదని నా ప్రార్థన'' అంటూ ఉన్న ఆ మెసేజ్ ఖజానా శాఖలో కలకలం రేపింది. కాగా, సరళ విజయకుమారి పదవీ విరమణ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లా ఖజానా శాఖ డీడీ వెంకటేశ్వర్లను జిల్లా ఖజానా శాఖ ఇన్‌చార్జ్ డీడీగా ప్రభుత్వం నియమించింది.

మహాత్ముని అడుగుజాడల్లో నడుద్దాం



మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అనంత, పార్టీ నేతలు

- సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అహింస, శాంతి ద్వారానే ఏదైనా సాధ్యమని నిరూపించిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని, అటువంటి మహనీయుని అడుగుజాడల్లో నడుద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు 'అనంత' మాట్లాడుతూ ప్రపంచమంతా మహాత్మా గాంధీకి నివాళులర్పించిందని తెలిపారు. అంటరానితనం రూపుమాపాలని, బడుగులు అన్ని విధాల అభివృద్ధి చెందాలని ఆయన పరితపించారన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి స్ఫూర్తితో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను నీరు గార్చడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, పార్టీ టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, నాగన్న, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్ర, మల్లెమీద నరసింహులు, శ్రీదేవి, సైఫుల్లా బేగ్, అమర్‌నాథ్ రెడ్డి, చంద్రలేఖ, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇసాక్, రాజేశ్వరి, నాయకులు కుళ్లాయస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాసుల వేట.. అవస్థల మేట

- కార్పొరేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం
- ఆకర్షణీయమైన పేర్లతో తల్లిదండ్రులకు బురిడీ
- రూ. లక్షలు వసూలు చేస్తున్నా వసతుల లేమి

- అనంతపురంలోని నారాయణ జూనియర్ కళాశాలలో 'కో-సూపర్‌చైనా' బ్యాచ్ జేఈఈ అడ్వాన్స్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ. 2 లక్షలు వసూలు చేస్తున్నారు. అలాగే 'ఎన్-120' బ్యాచ్‌కు రూ. 1.80 లక్షలు, 'సూపర్ చైనా' నీట్ బ్యాచ్‌కు రూ.1.70 లక్షలు, 'కో-స్పార్క్' బ్యాచ్‌కు రూ. 1.50 లక్షలు, 'జెఎఫ్‌టీబీ' బ్యాచ్‌కు రూ. 1.30 లక్షలు, 'ఎన్-40' బ్యాచ్‌కు రూ.1.30 లక్షలు లాగుతున్నారు. ఫీజుల పట్టికను కళాశాలల్లోనే బహిరంగంగా ప్రదర్శనకు ఉంచారు. తల్లిదండ్రులు ఎవరు వెళ్లిన తమ విద్యా సంస్థల్లో అమలు చేస్తున్న గ్రూపులు, వాటి ఫీజు ధరలు అంటూ కరపత్రాలు చేతిలో పెడుతున్నారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లోనూ ఐసీ, ఐకాన్, ఐపీఎల్, ఎంపీఎల్ పేర్లతో ఫీజుల దోపిడీ చేస్తున్నారు.



ఇటీవల విద్యార్థి చరణ్ ఆత్మహత్య చేసుకున్న సోములదొడ్డి సమీపంలోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ విద్యా సంస్థలు మాయ చేస్తున్నాయి. ఒకప్పుడు రూ. 20 వేలు, రూ. 30 వేల ఫీజులు ఉన్న కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో నేడు ఏ గ్రూపు తీసుకున్నా లక్షలాది రూపాయలు ఫిక్స్ చేశారు. రాష్ట్రంలో ఉన్న వివిధ బ్రాంచ్‌ల్లో బాగా వచ్చిన మార్కులు, ర్యాంకులను పట్టుకుని ఇక్కడ ప్రచారం చేసుకుంటూ తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్నారు.

విద్యార్థులను కుక్కేస్తూ..
లక్షల్లో ఫీజు వసూళ్లు చేస్తున్న యాజమాన్యాలు ఆశించిన స్థాయిలో వసతులు మాత్రం కల్పించడం లేదు. ఇటీవల విద్యార్థి చరణ్ ఆత్మహత్యకు పాల్పడిన నారాయణ రెసిడెన్షియల్ కళాశాలలో దాదాపు 2 వేలమంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు తెలిసింది. ఆ స్థాయిలో గదులు, మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు మాత్రం లేవు. హాస్టల్‌లో ఒక్కో గదిలో కనీసం ఆరుగురు విద్యార్థులుంటే ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే అగ్గిపెట్టెల్లాంటి గదుల్లో 12-14 మంది విద్యార్థులను కుక్కుతున్నారు. హాస్టల్‌కు వస్తే బెడ్డుమీద గడపాలి తప్ప కింద కాళ్లు పెట్టే పరిస్థితి కూడా ఉండడం లేదని చెబుతున్నారు.మరుగుదొడ్లు తరచూ శుభ్రం చేయని కారణంగా విద్యార్థులు చర్మవ్యాధుల బారిన పడుతున్నారు.

నీటికోసం విలవిల..
ఇటీవల నారాయణ బాలికల జూనియర్ కళాశాలలో నీరు సరఫరా కాక బాలికలు విలవిల్లాడారు. మూడు రోజులకోసారి మాత్రమే స్నానం చేయాలనే నిబంధన విధించారు. దాదాపు 10 రోజులు భరించిన విద్యార్థులు తర్వాత సాధ్యం కాక.. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు వచ్చి విన్నవించినా మార్పు రాలేదు.ఈ క్రమంలోనే విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ఎదుట వరుస ఆందోళనలు చేయగా.. దాదాపు 25 రోజుల తర్వాత సమస్య పరిష్కారమైందంటే విద్యార్థుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అరం చేసుకోవచ్చు.

అడ్డగోలుగా ఫీజులు



కార్పొరేట్ కళాశాలలకు ఒకచోట అనుమతులు తీసుకుని అక్రమంగా బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. ఫీజులు మాత్రం అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. కరువుకు నిలయంగా మారిన అనంతపురం జిల్లా గురించి దేశవ్యాప్తంగా అందరికీ తెలుసు. అయినా కళాశాలల యాజమాన్యాలు కనికరం లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నాయి.
– కాశీ మనోజ్, వైఎస్సార్‌సీపీ ఎస్‌యూ తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్షులు

మంత్రి లోకేష్ స్పందించాలి



ట్వీట్లు, వాట్సాప్ మెసేజ్‌లకు స్పందిస్తానంటున్న విద్యాశాఖ మంత్రి లోకేష్ గారూ... జిల్లాలో మీ సహచర మంత్రి నారాయణ కళాశాలలో ఓ విద్యార్థి బలవన్మరణం పొందాడు. ముందు ఈ చావుపై స్పందించండి. నారాయణ విద్యాసంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీపై, ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్న విద్యా సంస్థలపై మాట్లాడండి.
– నరేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

బయటకు సమాచారం రానివ్వడం లేదు



నగర శివారులోని నారాయణ జూనియర్ కళాశాల బాలికల వసతి గృహంలో ఇటీవల నీళ్ల లేక దాదాపు 20 రోజుల పాటు వేలాదిమంది విద్యార్థినులు స్నానాలు కూడా చేయలేదు. విషయం బయటకు పొక్కనీయకుండా అందుబాటులో ఉండే ఫోన్లన్నీ బంద్ చేశారు. విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేసి సమస్య పరిష్కారమయ్యేలా చేశాయి.
– సురేష్‌యాదవ్, బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి

అనంత అరసవల్లి.. బూదగవి

• 3 నుంచి బూదగవి సూర్య దేవాలయంలో రథసప్తమి వేడుకలు • దక్షిణాభిముఖంగా వెలసిన ఏకైక దేవాలయం • రాష్ట్రంలో రెండవది, దక్షిణ భారతదేశంలో మూడవదిగా గుర్తింపు

జిల్లాలో ఎన్నో పురాతన దేవాలయాలు ఉన్నాయి. అయితే సమస్తలోకాలకు వెలుగును ప్రసాదించే సూర్యభగవానుడి అరుదైన ప్రాచీన ఆలయం ఉరవకొండ మండలం బూదగవిలో ఉంది. ఈ ఆలయం అనంత అరసవల్లిగా విరాజిల్లుతోంది. ఈ ఆలయ విశిష్టతలపై రథసప్తమిని పురస్కరించుకుని 'సాక్షి' కథనం.


ఎన్నో విశిష్టతలున్న ఆలయంలోని శివలింగం



బూదగవిలో వెలసిన సూర్యనారాయణస్వామి ఆలయం, సూర్యనారాయణస్వామి మూలవిరాట్

ఉరవకొండ: దక్షిణ భారతదేశంలోనే అరుదైన ఆలయంగా బూదగవిలోని సూర్యదేవాలయం ఖ్యాతి గాంచింది. ఒడిశాలోని కోణార్క్, శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి తర్వాత బూదగవిలోని ఆలయానికి అంతటి ప్రాముఖ్యత ఉంది. 13వ శతాబ్దంలో చాళుక్యులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శాసనం ద్వారా తెలుస్తోంది. గర్భగుడిలో దక్షిణాభిముఖంగా సూర్యభగవానుడి మూలవిరాట్ ఉంది. ఈ అభిముఖంతో దేశంలో మరెక్కడా సూర్యభగవానుడి ఆలయాలు లేవని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు. మూలవిరాట్‌కు ఇరువైపులా దేవతా ప్రతిమలు ఒకే శిలలో చెక్కబడి ఉన్నాయి. అలాగే సూర్యభగవానుడి విగ్రహం ఎదుట నేలపై పరిచిన బండలపై సూర్య నమస్కారం చేస్తున్న మనిషి రూపాన్ని చెక్కారు. ఆలయం మొత్తం ఎటూ చూసిన కేవలం మూడు రాళ్లతో నిర్మించినట్లుగా గమనించవచ్చు. ఆలయంలో తూర్పు ముఖంగా అరుదైన శివలింగం నిత్య పూజలు అందుకుంటోంది. ఈ శివలింగం ఉపరితలంలో అమర్‌నాథ్‌లోని జ్యోతిర్లింగం ఆనవాళ్లు కన్పించడం విశేషం. రాష్ట్రంలో రెండవదిగా దక్షిణ భారతదేశంలో 3వదిగా భారతదేశంలో 8వదిగా ఈ ఆలయాన్ని పరిగణిస్తున్నారు.

మూలవిరాట్ పాదాలను తాకనున్న సూర్యకిరణాలు:

ఏటా రథసప్తమి పర్వదినం రోజు ఆలయంలో ఉదయం సూర్యుడి కిరణాలు నేరుగా గర్భాలయంలోని మూలవిరాట్‌కు తాకుతాయి. తూర్పున ఉదయించే సూర్యుడి కిరణాలు... దక్షిణాభిముఖంగా ఉన్న సూర్యభగవానుడి మూలవిరాట్‌ను తాకే అద్భుత దృశ్యాన్ని చూసేందుకు రాష్ట్రంలోని వివధ జిల్లాల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అరుదైన ఈ ఆలయం భగవాన్ సత్యసాయిబాబాను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ విశిష్టతపై అప్పట్లో సత్యసాయి సమగ్ర అధ్యాయనం చేయాలని తన శిష్యులను ఆదేశించారు. ఆలయం విశిష్టతను పుస్తక రూపంలో తీసుకోరావాలని సత్యసాయి అప్పట్లో ప్రయత్నించినట్లు గ్రామస్తులు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు.

పూర్తి స్థాయి వసతులు కల్పించాం



ఫిబ్రవరి 3న రథసప్తమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా పూర్తి స్థాయి వసతులు కల్పించాం. సజావుగా దైవ దర్శనం చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాలు అందుబాటులో ఉంచనున్నాం. రథసప్తమి నాడు సూర్యభగవానుడిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని భక్తులకు మనవి చేస్తున్నాం.

– ఛత్రగుడి చిరంజీవి, ఆలయ చైర్మన్, బూదగవి

3 నుంచి రథసప్తమి ఉత్సవాలు ప్రారంభం

బూదగవి సూర్యదేవాలయంలో ఫిబ్రవరి 3న రథసప్తమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా వేడుకలను నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. 3న ఆలయంలో విశేష హోమాలు నిర్వహించనున్నారు. 4న రథసప్తమి సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు, నిర్వహించి, ఛాయ, ఉషా సమేత సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించనున్నారు.

రోగులకు ఉత్తమ సేవలందించాలి

• కలెక్టర్ వినోద్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని సమన్వయంతో రోగులకు ఉత్తమ సేవలందించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వేదికగా గురువారం హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశం జరిగింది. సమావేశానికి హెచ్‌డీఎస్ చైర్మన్ హోదాలో కలెక్టర్, వైస్ చైర్మన్ హోదాలో స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, సభ్యులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్డీటీ హాస్పిటాలిటీ డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఓలేటి రత్నమయ్య, గంగారాం తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ సర్వజనాస్పత్రి, వైద్య కళాశాలకు ఆదాయ వనరులను అన్వేషించాలన్నారు. అందుబాటులో ఉన్న నిధులను సక్రమంగా వినియోగించుకుని రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆశించిన స్థాయిలో ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే వైద్యులు, స్టాఫ్‌నర్సులు తదితర సిబ్బందికి వాష్ రూం, డ్రస్సింగ్ రూం తదితర సౌలభ్యాలు కల్పించాలన్నారు. అనంతరం అజెండాలోని క్యాజువాలిటీ విస్తరణకు రూ.75 లక్షలు, అంబులెన్స్ కొనుగోలు, తదితర వాటికి కమిటీ ఆమోదం తెల్పింది. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఏడీ మల్లికార్జునరెడ్డి, హెచ్ఓడీలు డాక్టర్ భీమసేనాచార్, రామస్వామినాయక్, షంషాద్‌బేగం, డాక్టర్ భాస్కర్, డాక్టర్ ఆత్మారాం, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ కమిటీ నియామకం


జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ జిల్లా నూతన కమిటీ కన్వీనర్‌గా బ్రహ్మసముద్రం మండల ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన పంచాయతీ రాజ్ విభాగం సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. అలాగే కో–కన్వీనర్‌గా సుబ్బర హేమలత (ఎంపీపీ, ఆత్మకూరు), రాష్ట్ర అడహక్ కమిటీ సభ్యులుగా జి.వరలక్ష్మి (ఎంపీపీ, అనంతపురం రూరల్), ఎస్.వెంకటనారాయణ (ఎంపీపీ, గార్లదిన్నె), జి.ఉమాదేవి (ఎంపీపీ, యాడికి), జిల్లా అడహక్ కమిటీ సభ్యులుగా ఎం భవానీ (ఎంపీపీ, గుమ్మఘట్ట), బి.మాధవి (ఎంపీపీ, గుంతకల్లు), ఆర్.రమావత్‌దేవి (ఎంపీపీ, వజ్రకరూరు), జి.విశాలక్ష్మి (ఎంపీపీ, గుత్తిరూరల్)ని నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి, కూడేరు ఎంపీపీ ఎం.నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీపీ పనులు చేపట్టకపోతే ఉద్యమిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: తాను అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తున్నానని, బీటీపీ కాలువ పూర్తి చేసేందుకు ఏడాది గడువు ఇస్తున్నామని కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. పనులు ప్రారంభించకపోతే జూన్‌లో పాదయాత్ర చేపట్టి ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు సుధీర్, గోళ్ల సూరి, అడ్వకేట్ హనుమంతరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎస్ రాయుడుతో కలసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమలు కానీ అబద్ధపు హామీలతో ప్రజలను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. పెన్షన్లు ఇచ్చామని గొప్పలకు పోతున్న టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 8 నెలల్లోనే చంద్రబాబు పాలనపై పూర్తి వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బీటీపీ కాలువ పనులు చేపడతామని ఆ సమయంలో ఆ కాలువకు కాంట్రాక్టర్‌గా ఉన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హామీనిచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు అవుతున్నా కాలువ పనులు ఒక్క ఇంచ్ కూడా చేపట్టలేకపోయాని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్‌కు అవకాశం ఇస్తే ఈ ప్రాంతం బాగుపడుతుందని అప్పట్లో ప్రజలను నమ్మించి, అధికారం చేపట్టిన తర్వాత నట్టేటా ముంచారన్నారు. గతంలో జనసేన, టీడీపీ వారు గుంతలు పడిన రోడ్లపై ఫొటోలు దిగి వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేసేవారని, కానీ ఇప్పటికీ ఆ రోడ్లన్నీ గుంతలు, గతకులతోనే దర్శనమిస్తున్నాయన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో డ్రైనేజీ పనులు, బ్రహ్మసముద్రం మండలంలో రోడ్డు పనులు అన్నీ వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగాయన్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. హామీలను అమలు చేయలేని ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ విషయంలో తాము సవాల్‌ను స్వీకరిస్తున్నామన్నారు.

కుందుర్పిలో పర్యటించిన జిల్లా పురావస్తు శాఖ అధికారులు

కుందుర్పి: మండల కేంద్రంలో ఇటీవల చేపట్టిన డ్రైనేజీ ఏర్పాటులో కోట ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న పురాతన విగ్రహాలను తొలగించారు. దీంతో గ్రామానికి చెందిన పలువురు జిల్లా పురావస్తు శాఖ అధికార్లకు ఫిర్యాదు చేయడంతో ఆ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రజిత, ఇంపాక్ట్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు గురువారం కుందుర్పిలో పర్యటించి పురాతన విగ్రహాలను తొలగించిన ప్రాంతాలను పరిశీలించారు. అధికారుల నుంచి అనుమతి పొందకుండా విగ్రహాలను తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురాతన విగ్రహాలను యథాస్థానాల్లో ఉంచాలని గ్రామస్తులకు సూచించారు.

పశుశాఖలో కోల్డ్‌వార్

• జేడీ, డీడీలు, ఏడీలు, డాక్టర్ల మధ్య సమన్వయలోపం
• షీప్ యూనియన్ ఎన్నికల నేపథ్యంలో బహిర్గతం
• ఏకపక్షమంటూ జేడీ ఛాంబర్ ఎదుట డాక్టర్ల నిరసన
• సహకరించడం లేదంటూ డాక్టర్లకు షోకాజ్‌లు సిద్ధం



అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖలో అధికారుల నడుమ ప్రచ్ఛన్న యుద్ధం (కోల్డ్‌వార్) నడుస్తోంది. ఆ శాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, అలాగే డీడీలు, ఏడీలు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ (డాక్టర్లు) మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఇన్నాళ్లూ అంతర్గతంగా ఉన్న నిశ్శబ్ద యుద్ధం తాజాగా గొర్రెలు, మేకల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘాల (షీప్ యూనియన్) ఎన్నికలు నిర్వహిస్తున్న తరుణంలో ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. టీడీపీ ప్రజాప్రతినిధులు చెప్పినట్లుగా ఆ పార్టీ నేతలు ఎన్నికల్లో విజయం సాధించేలా పశుశాఖ వర్గాలు సహకరిస్తున్న విషయం తెలిసిందే. దీంతో అక్కడక్కడ షీప్ యూనియన్ ఎన్నికలు ఆగిపోయాయి. ఇప్పటికే మూడు విడతల్లో 107 సొసైటీలకు ఎన్నికలు పూర్తి కాగా ఫిబ్రవరి 5న తుది విడతగా 14 సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల అధికారులుగా పశువుల డాక్టర్లు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో పశువుల డాక్టర్లకు, జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, అలాగే షీప్ యూనియన్ విభాగం ఏడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి మధ్య ఇటీవల వాగ్వావాదాలు నడుస్తున్నాయి. తమకు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండా, నిబంధనలు తెలియజేయకుండా ఎన్నికల అధికారులుగా నియమించి ఎన్నికల సమయంలో తమను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారంటూ డాక్టర్లు తిరగబడుతున్న పరిస్థితి నెలకొంది. జేడీ, ఏడీలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ డాక్టర్లు మూకుమ్మడిగా రెండు రోజుల కిందట జేడీ చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడానికి జేడీ కార్యాలయం సిద్ధమైనట్లు తెలుస్తోంది. తాము ఎలాంటి తప్పు చేయలేదని, షోకాజ్‌లు ఇస్తే సహాయ నిరాకరణతో ఆందోళనకు వెనుకాడేదని లేదని డాక్టర్లు చెబుతున్నారు. మరోపక్క తాను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి డాక్టర్లు సరిగా సహకరించడం లేదంటూ జేడీ సైతం తీవ్ర స్థాయిలోనే మండిపడినట్లు సమాచారం. తాము సరిగా పనిచేయకుండానే పశుగణన, పశు ఆరోగ్య శిబిరాలు, వ్యాక్సినేషన్లు, గోకులాల నిర్మాణాల్లో జిల్లా మంచి పురోగతి కనబరచడం ఎలా సాధ్యమైందని డాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

హోరాహోరీగా సౌత్ జోన్ వెటరన్స్ క్రికెట్ టోర్నీ

అనంతపురం: ఆర్డీటీ క్రీడా గ్రామం వేదికగా సౌత్ జోన్ వెటరన్స్ ఆర్వీకే ప్రసాద్ స్మారక క్రికెట్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. ఆంధ్ర వెటరన్స్ , హైదరాబాద్ జట్ల మధ్య తొలి మ్యాచ్ హోరాహోరీగా సాగింది. టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంపిక చేసుకుంది. హైదరాబాద్ జట్టు 17.4 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. డాక్టర్ శేషగిరి మాత్రమే గౌరవ ప్రదమైన 26 పరుగుల స్కోరు చేశాడు. సయ్యద్ షాబుద్దీన్ మూడు, ఎ.రహమాన్ 3, ఎస్ఎస్.భరత్ కుమార్ 2 వికెట్లు తీసి హైదరాబాద్ జట్టును తక్కువ స్కోరుకు కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రా జట్టు కేవలం 15.3 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసి విజయం సాధించింది. కేఎస్ షాబుద్దీన్ 37 బంతుల్లో మూడు ఫోర్లతో 27 పరుగులు, ఎస్ఎస్ భరత్ కుమార్ 28 బంతుల్లో 32 పరుగులు, ఆర్ఎల్‌వీ ప్రసాద్ 25 బంతుల్లో (మూడు ఫోర్లు, ఒక సిక్సర్) 27 పరుగులు సాధించి జట్టు గెలుపులో కీలకంగా మారారు. ఈ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను కేఎస్ షాబుద్దీన్ దక్కించుకున్నాడు.

= మరో మ్యాచ్‌లో తమిళనాడు ఘన విజయం సాధించింది. తమిళనాడు వెటరన్స్, వసంత్ శరవణన్ షైన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తమిళనాడు బ్యాటింగ్ ఎంపిక చేసుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. వసంత శరవణన్ 57 బంతుల్లో (ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లు) 89 పరుగులు, ఎస్పీ నాథన్ 16 బంతుల్లో 45 పరుగుల (రెండు ఫోర్లు, ఐదు సిక్సర్లు)తో విజృంభించారు. ధాటిగా ఆడడంతో జట్టుకు మంచి స్కోరు దక్కింది. అనంతరం బ్యాటింగ్‌చేసిన సర్వీసెస్ వెటరన్స్ కేవలం 15.1 ఓవర్ల వద్ద 41 పరుగులకు చతికిల పడింది. దీంతో తమిళనాడు జట్టు 152 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌ను వసంత శరవణన్ దక్కించుకున్నాడు.

క్రీడలకు ఆర్డీటీ స్టేడియం మంచి వేదిక

క్రీడలకు ఆర్డీటీ స్టేడియం మంచి వేదిక అని బోర్డ్ ఆఫ్ వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ సుధీర్ కులకర్ణి అన్నారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివంగత మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ ఆర్వీకే ప్రసాద్ జ్ఞాపకార్థం ఏసీఏ వెటరన్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో వెటరన్ క్రికెట్ అసోసియేషన్ హైదరాబాద్ కార్యదర్శి సురేష్ రాజన్, వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ సర్వీసెస్ సెక్రెటరీ డీఎస్‌కే రెడ్డి, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకృష్ణ, సెక్రెటరీ పీఆర్ వెంకట సుబ్రమణియన్, సీనియర్ కోచ్ ఆర్ఎస్ఆర్ మూర్తి, మాజీ ఆంధ్రా రంజీ ఆటగాడు నగేష్, ఏసీఏ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బొలికొండ రంగనాథుడి కల్యాణోత్సవం ఖరారు


లగ్న పత్రిక రాస్తున్న అర్చకులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 11న అర్ధ రాత్రి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. గురువారం రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేసిన అనంతరం కల్యాణ లగ్నం, రథోత్సవ వేళలను నిర్ణయించి లగ్న పత్రికను అర్చకులతో రాయించారు. లగ్న పత్రికను ఆలయ ఈఓ రామాంజనేయులుకు అర్చకులు ఆదిశేషయ్య, రాఘవేంద్రాచార్యులు, పలుకూరి రవికుమార్ అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రంగనాయకులు, లిఖిల్ వర్మ, చేతన్ వర్మ, విష్ణు, మురళి, గ్రామస్తులు చిన్నారెడ్డి యాదవ్, రంగస్వామిరెడ్డి యాదవ్, డేగా మద్దిలేటి పాల్గొన్నారు.

ఇల్లాలి చదువు.. ఇంటికి వెలుగు

• సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్


మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి శివప్రసాద్‌యాదవ్

గార్లదిన్నె: చదువుకున్న భార్య ఉంటే ఆ ఇల్లు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్ అన్నారు. గార్లదిన్నెలోని రైతు సేవా కేంద్రంలో జాతీయ న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గురువారం మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా జడ్జి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క మహిళా చదువుకోవాలన్నారు. సమాజంలో మహిళల పట్ల వివక్ష చూపరాదన్నారు. ప్రతి ఒక్కరూ మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు అరికట్టడానికి అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఎవరైనా కోర్టు కేసుల్లో వాదనలు వినిపించడానికి ఉచిత న్యాయ సహాయం కోసం జాతీయ లోక్ అదాలత్ సంస్థలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు హరికృష్ణ, పద్మజ, తహసీల్దార్ ఈరమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఎంఈఓ చంద్రానాయక్, ఏపీఎం మల్లికార్జున పాల్గొన్నారు.

జింక కళేబరానికి పోస్టుమార్టం

బెళుగుప్ప: గాయాలతో నడవలేని స్థితిలో ఉన్న మగ జింకకు చికిత్స అందజేసిన కాసేపటిలోనే మృతి చెందింది. వివరాలు.. బెళుగుప్ప మండలం యలగలవంక సమీపంలో గురువారం గాయాలతో పడి ఉన్న జింకను స్థానిక రైతులు గుర్తించారు. సమాచారం అందుకున్న రమనేపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పెద్దన్న, వన్యప్రాణ సంరక్షణ సిబ్బంది అక్కడకు చేరుకుని జింకను వెంటనే బెళుగుప్పలోని పశువైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం రమనేపల్లి అటవీశాఖ కార్యాలయాన్ని చేర్చారు. పరిస్థితి విషమించడంతో కాసేపటికే జింక మృతి చెందింది. అనంతరం అక్కడే జింక కళేబరానికి పశువైద్యాధికారులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం దహనం చేశారు.

మీడియా గొంతు నొక్కే ప్రయత్నం సిగ్గుచేటు

• పాత్రికేయులపై జులుం సహించబోం
• ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



గుంతకల్లుటౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడుతున్న మీడియా గొంతు నొక్కాలని చూడడంసిగ్గుచేటని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. తనపై ఎవరైనా వ్యతిరేక వార్తలు రాస్తే రైలు పట్టాలపై పడుకోబెడతానంటూ మీడియా ప్రతినిధులను బెదిరించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ వైఖరిని ఆయన ఖండించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అసత్య వార్తలు ప్రచురించినా, ప్రసారం చేసినా చట్టపరంగా ఎదుర్కోవాలన్నారు. అంతేకానీ పాత్రికేయుల అంతు చూస్తానని బెదిరిస్తే పుట్టగతులుండవని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలను బయటపెట్టి ప్రజల పక్షాన అక్షర సమరం సాగిస్తున్న పత్రికా స్వేచ్ఛను కాలరాయాలని చూస్తే చరిత్రలో నియంతలుగా మిగిలిపోతారన్నారు. అధికారబలంతో మీడియాపై జులుం ప్రదర్శిస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పాత్రికేయులకు జయరామ్ బేషరత్తుగా క్షమాపణ చెప్పాలన్నారు.

ఎమ్మెల్యే జయరాం బహిరంగ క్షమాపణ చెప్పాలి

• సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప



అనంతపురం అర్బన్: పాత్రికేయ వ్యవస్థను కించపరుస్తూ విలేకరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లమ్మ డిమాండ్ చేశారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జయరాం వ్యాఖ్యలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మీడియాలో ఏదైనా కథనం లేదా వార్త తమపై వచ్చి ఉంటే సంబంధిత విలేకరులను పిలిచి సదరు అంశానికి సంబంధించిన వాస్తవాలు తెలపాల్సి ఉందన్నారు. ఇందుకు భిన్నంగా మాట్లాడుతూ... విలేకరులను రైలు పట్టాలపై పడేస్తానని, తాను అన్నీ చేసి వచ్చానని, ఎవరికీ భయపడనని వ్యాఖ్యానించడం తన దుర్మార్గాలను తానే బయటపెట్టుకున్నట్టిందన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి, ప్రస్తుతం బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే పదవిలో ఉంటూ ఇలా విలేకరులను బెదిరించడం అంటే ప్రజలను, ప్రజాతంత్రవాదులను హెచ్చరికలు జారీ చేసినట్లుగా భావించాల్సి వస్తోందన్నారు. తన అక్రమాలను, దుర్మార్గాలను ఎవరూ ప్రశ్నించ కూడదని... ప్రశ్నిస్తే అంతు చూస్తామని బెదిరించిన జయరాం తీరుపై అధిష్టానం తన వైఖరి ఏమిటో స్పష్టం చేయాలన్నారు.

వ్యక్తి దుర్మరణం

బుక్కరాయసముద్రం: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం కేకే అగ్రహారం ఆగ్రామానికి చెందిన శ్రీనివాసమూర్తి (50) చెన్నంపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ఆయన ద్విచక్ర వాహనంపై అనంతపురానికి వెళుతుండగా మార్గమధ్యంలో బొమ్మలాటపల్లి వద్దకు చేరుకోగానే నార్పల నుంచి వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో కిందపడిన శ్రీనివాసమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేస్తాం

• మంత్రి పయ్యావుల కేశవ్


ఛాయాపురం వద్ద హంద్రీ–నీవా ప్రధాన కాలువను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

వజ్రకరూరు: రాయలసీమకు వరదాయినిగా ఉన్న హంద్రీ–నీవా కాలువ వెడల్పు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. వజ్రకరూరు చిన్నహోతురు వద్ద ఉన్న హంద్రీ–నీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ, చాయాపురం వద్ద ఉన్న ప్రధాన కాలువ, రాగులపాడు లిఫ్టును గురువారం హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో కలసి ఆయన పరిశీలించి, మాట్లాడారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టును రాయలసీమ ప్రాజెక్టులకు అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. హంద్రీనీవా కాలువ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ కర్నూలు ఎస్ఈ వరప్రసాద్, సీఈ నాగరాజు, ఈఈ శ్రీనివాస్‌నాయక్, డీఈ వెంకటరమణ, ఏఈలు సురేష్‌నాయక్, భీమలింగేశ్వర ఉన్నారు.

ముచ్చుకోటలో చోరీ

పెద్దపప్పూరు: తాళం వేసిన ఇంట్లోకి ఆగంతకులు చొరబడి విలువైన బంగారం, నగదు అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటకు చెందివన రామేశ్వరరెడ్డి గురువారం ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తలుపులు తీసిన విషయాన్ని గుర్తించి లోపలకు వెళ్లి పరిశీలించాడు. బీరువాలోని 12 తులాల బంగారు నగలు, రూ.2 లక్షల నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

విద్యార్థి నాయకుల అరెస్ట్ అప్రజాస్వామికం

అనంతపురం ఎడ్యుకేషన్: నారాయణ విద్యా సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి చరణ్ ఆత్మహత్యకు కళాశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అండతో నారాయణ విద్యా సంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాంభూపాల్ రెడ్డి, దేవేంద్ర, హరినాథ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనరసింహ

ఆత్మకూరు: గ్రామాల్లో ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేద్దామని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తరాదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న హౌస్ హోల్డ్, జియో ట్యాగింగ్, మిస్సింగ్ పర్సన్ మ్యాపింగ్ తదితర అంశాలపై చర్చించారు. అదే విధంగా సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కామక్క, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

4న శివపార్వతుల కల్యాణం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి దేవస్థానంలో రథసప్తమి పర్వదినం సందర్భంగా ఫిబ్రవరి 4న శివపార్వతుల కల్యాణం జరగనుంది. గురువారం ఆలయంలో కల్యాణోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు మఠం విజయ్ మాట్లాడుతూ.. 4వ తేదీ సాయంత్రం 6 గంటలకు కల్యాణం, తీర్థప్రసాద వినియోగం, అన్నప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు. భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పయ్యావుల కేశవ్‌కు సమస్యలు విన్నవిస్తున్న టైం స్కేల్ ఉద్యోగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని టైం స్కేలు ఉద్యోగులు కోరారు. గురువారం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేడర్ వైజ్‌తో పాటు, జీతాల పెంపుదల, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు. గత రెండు దశాబ్దాలుగా కేవలం బేసిక్ వేతనంతో పని చేస్తున్నామని తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలన్నారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టైం స్కేలు ఉద్యోగుల సంఘం నాయకులు కే.చంద్రశేఖర్ నాయుడు, హెచ్‌బీ సంజీవప్ప, రవి, హనుమంతు, బి.నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓ మలోలపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ కులాల వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పక్కనే ఉండగా.. పేకాట ఆడిన డీఆర్వో మలోలపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సాకే హరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ.. పోలీసులు అక్రమంగా తనను అరెస్టు చేశారన్నారు. ఇది చాలా దారుణమన్నారు. ప్రభుత్వ అధికారి విధుల్లో ఉండగా.. పేకాట ఆడటం ఎంత వరకు కరెక్టు అని ప్రశ్నించారు. డీఆర్‌ఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే ఆయన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అవగాహన కల్పించాలి



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రజలకు ఈ చట్టంపై అవగాహన ఉంటే ప్రభుత్వ పథకాల్లో అవకతవకలు జరగడానికి అవకాశం ఉండదు. కార్యాలయాల్లో చట్టానికి సంబంధించి సమాచారం అందించే అధికారుల పేర్లను బోర్డుల్లో నమోదు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామ సచివాలయాల ముందు ఏర్పాటు చేసిన బోర్డుల్లో పాత అధికారుల పేర్లే ఉన్నాయి. వాటిని మార్చితే ప్రజలకు ఇబ్బందులు ఉండవు.

– గౌరవ లక్ష్మీదేవి, సర్పంచు, హంపాపురం

ప్రజల్లో చైతన్యం కల్పిస్తాం




గ్రామాల్లో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం కోరితే వారికి నిబంధనల ప్రకారం సకాలంలో కోరితే వారికి నిబంధనల ప్రకారం సకాలంలో కోరిన వివరాలను అందించేందుకు కృషి చేస్తాం. ఈ సమాచార హక్కు చట్టాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. మండలంలోని వివిధ కార్యాలయాల వద్ద ఉన్న సమాచార హక్కుచట్టం బోర్డుల్లో పాత అధికారుల పేర్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజా సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, ప్రథమ అప్పిలేట్ అధికారుల పేర్లు అప్‌డేట్ చేయిస్తాం.

– బి.విజయలక్ష్మి, ఎంపీడీఓ, రాప్తాడు


అధికారులు మారినా.. సమాచారం మార్చరా?

సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన కార్యక్రమాలు, అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేసిన వివరాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు సామాన్యులకు ఈ చట్టం ఉపయోగపడుతుంది. అయితే సమాచారం కోసం కార్యాలయాల వద్దకు వెళ్లినప్పుడు ఏ అధికారిని సంప్రదించాలో ప్రజలకు అర్థం కావడం లేదు. అధికారులు బదిలీ అయినా పలు కార్యాలయాల వద్ద సమాచార హక్కు చట్టం బోర్డులో పేర్లు మార్చడం లేదు. పాత అధికారుల పేర్లు ఉండటంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

- సమాచార హక్కు చట్టం బోర్డుల్లో దర్శనమిస్తున్న పాత అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు
- బోర్డులపై సమాచారాన్ని మార్చడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఎవరిని సంప్రదించాలో తెలియక తికమకపడుతున్న ప్రజలు



హంపాపురం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో దర్శనమిస్తున్న పాత అధికారుల పేర్లు



రాప్తాడు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులో కనిపిస్తున్న పాత అధికారుల పేర్లు

రాప్తాడు: కార్యాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులో ప్రజా సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, ప్రథమ అప్పిలేట్ అధికారి పేర్లు సైతం సరిగ్గా నమోదు చేయడం లేదు. ఈ పేర్లు రాయడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకోవాలనే వారికి ఏ అధికారిని సంప్రదించాలో తెలియడం లేదు. అధికారులు మారి ఆరు నెలల దాటినా గ్రామ సచివాలయాల ముందు ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులో వారి పేర్లు మాత్రం మారడం లేదు. ఇప్పుడు కూడా వారే ఉన్నారా.. అంటూ రైతులు, ప్రజలు తికమకపడుతున్నారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వాటిలో రెండు, మూడు మినహా మిగిలిన గ్రామ సచివాలయాల వద్ద పాత అధికారుల పేర్లే కనిపిస్తున్నాయి. గ్రామ సచివాలయాల వద్ద అధికారులు సమాచార హక్కు చట్టం–2005 పెయిటింగ్ బోర్డును ఏర్పాటు చేశారు. అందులో ప్రజా సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, ప్రథమ అప్పిలేట్ అధికారి పేర్లు ఉన్నాయి. వారిలో ప్రజా సమాచార అధికారి మాధవి గత రెండేళ్ల క్రితమే బదిలీపై వేరొక ప్రాంతానికి వెళ్లారు. అయినా ఆమె పేరు ఇంకా మార్చలేదు. ప్రస్తుతం ప్రజా సమాచార అధికారిగా ఆనంద్ ప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎంపీడీఓగా సాల్మన్, పంచాయతీ కార్యదర్శుల పేర్లు అప్పటి అధికారుల పేర్లే ఉన్నాయి. ఎంపీడీఓతో పాటు పంచాయతీ కార్యదర్శులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాధారణ బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ప్రస్తుతం ఎంపీడీఓగా విజయలక్ష్మి విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమాచార హక్కు చట్టం బోర్డులో పేర్లు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

గాంధీ ఆశయసాధనకు కృషి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: భారతదేశంపై చెరగని ముద్ర వేసిన మహోన్నతమైన వ్యక్తి మహాత్మాగాంధీ అని మేయర్ వసీం పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం నగరపాలక సంస్థలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాపూజీ చూపిన సత్యం, అహింసా మార్గాలు భావితరాలకు బంగారు బాటగా నిలిచాయన్నారు. ప్రతి ఒక్కరూ అహింస మార్గంలో పయనించి గాంధీ ఆశయాల కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, కమిషనర్ మల్లికార్జున రెడ్డి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

అనంతపురం టవర్‌క్లాక్: జాతిపిత మహాత్మా గాంధీని యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అనంతపురం అర్బన్ ఇన్‌చార్జ్ దాదాగాంధీ అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక టవర్‌క్లాక్ వద్ద మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేష్, పోతుల మనోజ్, సత్రసాల మంజునాథ్, వంకదారి వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నతీకరించాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరపాలక, పురపాలక పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నతీకరించాలి. స్కూళ్ల పునర్నిర్మాణ ప్రక్రియలోని అసంబద్ధాలను తొలగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ ప్రసాద్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా నగరపాలక, పురపాలక పరిధిలోని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించాలని డిమాండ్ చేశారు. చాలా ప్రాథమికోన్నత పాఠశాలల్లో సదుపాయాలు లేవని తెలిపారు. ఉన్నత పాఠశాలలకు దగ్గర ఉన్నాయని కారణాలు చూపుతూ ఉన్నతీకరణ చేయకుండా నిలిపేస్తున్నారన్నారు. వార్డు యూనిట్ ఆధారంగా పాఠశాలల ఏర్పాటు ప్రక్రియ చేపట్టాలన్నారు. లేదంటే పురపాలక పరిధిలో పాఠశాలలు తగ్గిపోయే ప్రమాదముందని వాపోయారు. జనసాంద్రత అధికంగా ఉన్న కారణంగా నిబంధనలను మార్పు చేసి పిల్లల సంఖ్య ఆధారంగా ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర మున్సిపల్ టీచర్ల సంఘం కన్వీనర్ ఫణి భూషణ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, నాయకులు రవి, అజయ్ కుమార్, ప్రకాష్ రెడ్డి, మురళీకృష్ణ, కంబగిరి రాముడు, రాజశేఖర్, చంద్రశేఖర్ రావు, డేనియల్, మల్లికార్జున పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సూచనలిస్తున్న సీఐ కె.సాయినాథ్

అనంతపురం: సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కె.సాయినాథ్ అన్నారు. గురువారం కోవూరు నగర్‌లోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కొరియర్ పేరుతో మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్, లాటరీల పేరుతో మోసాలు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు మోసాలు, తక్కువ డబ్బుల పెట్టుబడి పెడితే అధికంగా డబ్బులు ఇస్తామని చెప్పే మాటలు నమ్మొద్దన్నారు. వీడియో కాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్, తదితర సైబర్ నేరాలపై వివరించారు. రోడ్డు సేఫ్టీ, మత్తు పదార్థాల అనర్థాలను వివరించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.

స.హ చట్టంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న హొన్నూరప్ప

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు పరిరక్షణ సంఘం నూతన కమిటీని గురువారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని విద్యుత్ కళావేదికలో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా ఆర్‌టీఐ యాక్టివిస్టు హొన్నూరప్ప, గౌరవాధ్యక్షుడిగా నబీరసూల్, వర్కింగ్ ప్రెసిడెంటుగా ఇమామ్ వలి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ అంకె రామలింగమయ్య, హుసేన్‌పీరా, రసూల్ ప్రధాన కార్యదర్శిగా వీరేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా మనోజ్‌కుమార్, రామాంజనేయులు, భానుప్రకాష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా తోట బాలన్న, కల్చరల్ సెక్రటరీగా రషీద్ ఎంపికయ్యారు. సమాచార హక్కు చట్టంపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వ అధికారుల అవినీతిని బహిర్గతం చేయాలని తీర్మానించారు.

‘ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని మార్చొద్దు’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంతపురం అర్బన్/అనంతపురం కల్చరల్: గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం వైఎస్సార్ జిల్లా కడపలోనే ఉంచాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బ్యాంకుల విలీనం పేరుతో ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి మార్చడాన్ని వ్యతిరేకిస్తూ రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు ఎస్‌ఎం బాషా, తదితరులు మాట్లాడారు. రాయలసీమ వెనుబాటుకు ప్రభుత్వ పాలకులే కారణం అన్నారు. పరిపాలనలో రాష్ట్రపతి నుంచి ముఖ్యమంత్రుల వరకు అగ్రభాగాన రాయలసీమ ప్రాంత ప్రజాప్రతినిధులే ఉన్నప్పటికీ రాయలసీమకు అన్యాయం చేయడంలో ముందంజలోనే ఉన్నారంటూ విమర్శించారు. ప్రతి అంశంలోనూ ఇది స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. విభజన అంశాల్లో ఒకటి కూడా అమలు కాలేదని మండిపడ్డారు. బెల్ వంటి జాతీయ సంస్థలు శంకుస్థాపనలకే పరిమితమయ్యాయన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తదితర వాటిని పూర్తిగా విస్మరించారన్నారు. ఎయిమ్స్‌ను మంగళగిరి తరలించారని గుర్తు చేశారు. హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ అంటూ దగా చేస్తున్నారన్నారు. అమరావతిలో చిన్నపాటి వర్షాలు కురిస్తే చాలు భవనాలు కూలిపోయే పరిస్థితి ఉందన్నారు. అయినా అక్కడికే ప్రధాన కార్యాలయాలు తరలిస్తుండటం చూస్తుంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అన్నారు. కడపలో అధునాతన సౌకర్యాలతో సొంత భవనం ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని మార్చే ఆలోచనను ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం పెద్దన్న గౌడ్, జయరామప్ప, ఏఐటీయూసీ రాజారెడ్డి, రైతు సంఘం చంద్రశేఖర్ రెడ్డి, మల్లికార్జున, వైఎస్సార్‌టీయూ ఓబిరెడ్డి, ఐఎఫ్‌టీయూ ఏసురత్నం, యూటీఎఫ్ నాగేంద్ర, సిటిజన్ ఫోర్ ఏజీరాజమోహన్, వివిధ సంఘాల నాయకులు బాలరంగయ్య, చంద్రశేఖర్, దస్తగిరి, శివారెడ్డి, రవితేజ, వైద్యనాథ్, విద్యాసాగర్, ప్రకాష్ నాయుడు. గోవిందరెడ్డి, పరమేష్, సూర్యచంద్ర యాదవ్, పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న అర్చకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

అనంతపురం కల్చరల్: అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న అర్చకులకు న్యాయం చేయాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు పూజారి భీమప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయంలో జిల్లా అర్చక సమాఖ్య సమావేశం జరిగింది. అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కోటపాడు శ్రీనివాసులు, రాష్ట్ర సహకార్యదర్శి బసవరాజుతో పాటూ జిల్లా అధ్యక్షులు పూజారి భీమప్ప, ప్రధాన కార్యదర్శి శివశంకర శర్మ తదితరులు మాట్లాడారు. అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 133 అర్జీలను అందించారు. డీడీఎన్‌ఎస్ (దూపదీప నైవేద్యం), వేతనాలు నిలిచిపోయిన డెత్ గ్రాడ్యుటీ పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. పబ్లికేషన్ నంబర్ టెంపుల్ కోడ్ లేని ప్రైవేటు దేవాలయాలకు వాటిని వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డెత్ స్పేసియా మ్యారెజ్ లోన్స్, ఆలయ స్థిరాస్తులను తెలిపే 43 రిజిస్టర్స్ విషయంలో తాత్సారం చేయొద్దన్నారు. ఏసీ ఆదిశేషు నాయుడు మాట్లాడుతూ.. మరో 20 రోజుల్లోపు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. అంతకు ముందు ఆలయంలో మహాశివుడికి పూజలు చేపట్టారు. కార్యక్రమంలో సమాఖ్య మాజీ అధ్యక్షులు ద్వారకానాథాచార్యులు, బాలాజీ, గోపాల్, హనుమంత రాయుడు, మారుతి, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నగదు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

చెన్నేకొత్తపల్లి: సూక్ష్మనీటి పరికరాలు కావాల్సిన రైతులు సబ్సిడీ ధర పోను మిగిలిన మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని ఎంఐఏఓ రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా రైతుల వద్దకు వచ్చి డ్రిప్పులు, స్ప్రింక్లర్లను త్వరగా ఇస్తామని చెబితే మోసపోవద్దని సూచించారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు చెన్నేకొత్తపల్లిలోని తమ కార్యాలయానికి రావాలని సూచించారు.

జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

రాయదుర్గంటౌన్: జంతువులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉరవకొండ డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కణేకల్లు రోడ్డులోని ప్రాంతీయ పశువైద్యశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహించారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక మందులు వేయించాలన్నారు.

ఆర్థిక ప్రగతి సాధించాలి

అనంతపురం కార్పొరేషన్: పేదలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని మెప్మా సిబ్బందిని కమిషనర్ మల్లికార్జున రెడ్డి ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థలో పట్టణ జీవనోపాధుల అభివృద్ధి సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, దీనదయాల్ యోజన జాతీయ పట్టణ జీవనోపాదుల సంస్థ మార్గదర్శకాల ప్రకారం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో మెప్మా పీడీ విశ్వజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

అనంతపురం: నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో ఓ లాడ్జిలో మట్కా బీటర్‌ను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. మట్కా బీటర్ ప్రశాంతిని అరెస్ట్ చేసి, రూ.7,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్నదానానికి విరాళం

రాప్తాడు: నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివదీక్షాపరులకు అన్నదానం చేసేందుకు రాప్తాడుకు చెందిన శివమాలాధారుడు పామాల్ల నారాయణ స్వామి గురువారం ఆర్థికసాయం చేశారు. ఇప్పటికే రాప్తాడుకు చెందిన గురుస్వామి గవ్వల మల్లికార్జున, మోకే రాజా, పాటిల్ భార్గవ్ కూడా విరాళాలు అందజేసినట్లు గురుస్వామి గౌరవ శివయ్య తెలిపారు. మరికొంత మంది భక్తులు బియ్యం ప్యాకెట్లు, నిత్యావసర సరుకులు ఇస్తున్నారని పేర్కొన్నారు.

డిప్లొమోతో ఉజ్వల అవకాశాలు



ప్రదర్శనలను తిలకిస్తున్న జేఎన్‌టీయూ(ఏ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు

అనంతపురం: డిప్లొమో కోర్సుతో ఉజ్వల అవకాశాలు ఉన్నాయని జేఎన్‌టీయూ(ఏ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. రుద్రంపేటలోని పీవీకేకే డిప్లొమో కళాశాలలో ‘స్వాధ్యాయ–2025’ పేరుతో రెండు రోజుల పాటు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకతతో కూడిన నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శనలు ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. 155 ప్రాజెక్టుల ప్రదర్శనకు మొత్తం 3,700 మంది పైగా విద్యార్థులు వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి రావడం అభినందనీయని పేర్కొన్నారు.

నారాయణ కళాశాలను సీజ్ చేయాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నారాయణ విద్యా సంస్థలు విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయాలుగా మారుతున్నాయని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం అన్నారు. కారణమైన కళాశాల యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు సుమోటోగా కేసును స్వీకరించి కళాశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. తక్షణమే కళాశాలను సీజ్ చేసి సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. నారాయణ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మంత్రి నారాయణను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలపై చర్యలు తీసుకోకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు దివాకర్, విజయ్, గణేష్, బాబు పాల్గొన్నారు.